ఆధ్యాత్మిక చింతన ద్వారానే సమాజంలో శాంతి

● కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



దుర్గాభవానీ అమ్మవారి వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన ద్వారానే సమాజంలో శాంతి చేకూరుతుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారతీయ ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. ఆదివారం బర్కత్‌పుర లింగంపల్లిలోని శ్రీమహాకాళి ఆలయం వద్ద దుర్గాభవానీ అమ్మవారి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతీయ ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు, రామాయణ, మహాభారతం ప్రపంచానికే ఆదర్శం అన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమహాకాళి ఆలయం కమిటీ అధ్యక్షుడు డి.గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎస్.అరవింద్, ఉపాధ్యక్షుడు యాదప్ప, కోశాధికారి కృష్ణ, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, ఎ.సూర్య ప్రకాష్‌సింగ్, సి.వినోద్‌యాదవ్, క్షీరసాగర్, చిట్టి శ్రీధర్, బల్వీర్ పాల్గొన్నారు.

'జనగామ జిల్లాకు సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెట్టాలి'

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జనగామ జిల్లాకు సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెట్టాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. ఆదివారం కాచిగూడ మోతీమార్కెట్‌లోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వాయి పాపన్న పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. గోల్కొండ కోటలో సర్వాయి పాపన్న కాంస్య విగ్రహాన్ని, పోస్టల్ స్టాంప్ విడుదల చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'మార్వాడీ గో బ్యాక్'ను విరమించుకోవాలి

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో కొంత మంది మార్వాడీలను టార్గెట్ చేస్తూ మార్వాడీ గో బ్యాక్ అనే నినాదం ఇస్తున్నారని, దీనిని తక్షణమే విరమించుకోవాలని సామాజిక తెలంగాణ ఫోరం ప్రతినిధులు డాక్టర్ హరికాంత్, కుమ్మరి మహేష్, శరత్, తేజావల్ రవి డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో వారు మాట్లాడుతూ దేశంలోని పౌరులందరూ ఏ రాష్ట్రానికైనా వెళ్లి వ్యాపారం చేసుకునే హక్కు ఉందని, తెలంగాణ ప్రాంతం గంగా, జమున, తేహదీబ్‌కి ప్రతీక అని అన్నారు. వైషమ్యాలు అవసరం లేదన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మార్వాడీలకు పూర్తి రక్షణ కల్పించాలని కోరారు.



తైక్వాండో క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బెల్టులను అందజేసిన హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి

ముషీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టిసారించాలని హైదరాబాద్ తైక్వాండో అసోసియేషన్(హెచ్‌టీఏ) అధ్యక్షుడు కృష్ణ అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో బెల్టు గ్రేడింగ్, కలర్ బెల్టు సర్టిఫికెట్లు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ... చిన్నతనం నుంచే మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టి సారించాలని సూచించారు. మహిళలు కూడా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు సంజయ్, స్వామి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

18, 19వ తేదీల్లో చలో ఢిల్లీ



చలో ఢిల్లీ కోసం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, అంజి తదితరులు

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని బీసీ సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఈనెల 18,19వ తేదీలలో ఢిల్లీలో జరిగే చలో ఢిల్లీ ఆలిండియా ఓబీసీ సదస్సులో పాల్గొనేందుకు బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ నాయకత్వంలో నాయకులు ప్రత్యేక రైలులో బయలుదేరారు. ఢిల్లీకి వెళ్లిన బీసీ నాయకత్వం బృందంలో జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీష్, రాజునేత, మణికంఠ, పృథ్వీగౌడ్, రాందేవ్ మోదీ, అరవింద్, లింగ స్వామి ముదిరాజ్, కౌశిక్; శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ఎన్ఎస్ఎస్ మార్చ్‌పాస్ట్






బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాడెట్ల మార్చ్‌పాస్ట్, ఆయుధాల వినియోగంపై డ్రిల్ జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, డైరెక్టర్ యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

రైలులో ఇద్దరు మహిళల మంగళ సూత్రాల చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చంగల్‌పట్ ఎక్స్‌ప్రెస్ రైలు చైన్ లాగి, ఇద్దరు మహిళల మంగళ సూత్రాలను దొంగలు లాక్కొని పారిపోయారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్‌కు చెందిన భవానీ(55) కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లారు. ఆమె చంగల్‌పట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు ఎస్-7 బోగీలో వస్తుంది. అదే రైలులో నగరానికి చెందిన గాయత్రి(23) ఎస్-9 బోగీలో వస్తుంది. రైలు డోన్ మహిళాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో దొంగలు రైలు చైన్ లాగారు. రైలు స్లో కాగానే భవాని మెడలో ఉన్న తులం బంగారు మంగళసూత్రం, గాయత్రి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు మంగళసూత్రాన్ని దొంగలు లాక్కొని పారిపోయారు. బాధితురాళ్ల ఫిర్యాదు మేరకు ఆదివారం ఈ కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూలు రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా, ఎంకే.బోసు తదితరులు

'స్థానిక', జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధం కావాలి

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సిద్ధం కావాలని, నియోజకవర్గాల వారీగా 25 వేల ఓటర్లకు ఒక క్లస్టర్ ఇన్‌చార్జీలను నియమించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఆదేశించారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా తెలిపారు. ఆదివారం పార్టీ నగర కార్యాలయంలో టీడీపీ ముషీరాబాద్ నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం మాజీ కార్పొరేటర్ బాల్‌రాజ్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబా, పార్టీ పరిశీలకులు పరుశరామ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో 25 వేల ఓటర్లకు ఒక క్లస్టర్ చొప్పున, ఒక ఇన్‌చార్జిని నియమిస్తామన్నారు.



రాంనగర్‌లోని త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీగణనాథుడి ఆగమన ర్యాలీ





శ్రీగణనాథుడి ఆగమనర్యాలీని తిలకించేందుకు రాంనగర్ చౌరస్తాకు తరలివచ్చిన జనం

ఘనంగా గణనాథుల ఆగమన ర్యాలీలు

● వేలాదిగా తరలొచ్చిన యువత
● ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన లైటింగ్, నాగ్‌పూర్ బ్యాండ్, బాణసంచాల పేలుళ్లు, డ్రోన్‌లతో పూల వర్షం
● పాల్గొన్న ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ యువజన నేత జైసింహ, ప్రముఖులు



ర్యాలీ కోసం రాంనగర్ చౌరస్తాలో లైటింగ్



ఆగమన కార్యక్రమంలో నోటి నుంచి మంటలు తీస్తున్న ఓ కళాకారుడు



ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ యువజన నాయకుడు జైసింహ తదితరులు



ఆగమన ర్యాలీలో ఆకట్టుకున్న కళాకారుల బ్యాండ్ నృత్యం

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని రాంనగర్‌లోని పలు అసోసియేషన్లు గణనాథుల ఆగమన వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించాయి. నిమజ్జనాన్ని తలపించే విధంగా నూతన ఆగమన సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. రాంనగర్‌లోని త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 27 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న గణనాథుల ఉత్సవాలలో భాగంగా ఈ సంవత్సరం రాంనగర్ కా రాజా పేరుతో ఆగమన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధి సాయిసంతోష్ అండ్ టీమ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేసిన వినాయకుడిని ఆజామాబాద్‌లోని బీఈ చౌరస్తా నుంచి రాంనగర్ చౌరస్తా వరకు భారీ ఎత్తున ఆగమన ర్యాలీ నిర్వహించారు. రాంనగర్ చౌరస్తాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లైటింగ్ సిస్టం ద్వారా గణనాథుడికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డ్రోన్‌ల ద్వారా గణనాథుడి విగ్రహంపై పూల వర్షం కురిపించారు. అదేవిధంగా డ్రోన్ ద్వారా శ్రీహనుమంతుడు ఎగురుతున్నట్లు నిర్వహించిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ ర్యాలీలో పూణె బ్యాండ్ కళాకారుల నృత్యం, విన్యాసం విశేషంగా ఆకట్టుకుంది. ఈ ర్యాలీని రాంనగర్ పరిసర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో యువకులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, త్రిశూల్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు దినేష్, రాజు, రఘు, అభిషేక్, సాయిమహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌టీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో

రాంనగర్‌లోని టీఆర్‌టీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే గణనాథుడి ఆగమన కార్యక్రమం శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. గణనాథుడి విగ్రహాన్ని వీఎస్టీ చౌరస్తా నుంచి రాంనగర్ చౌరస్తా మీదుగా టీఆర్‌టీ కాలనీ వరకు అత్యంత వైభవంగా తీసుకెళ్లారు. ఈ ర్యాలీలో కాలనీవాసులు పూలవర్షంతో గణనాథుడికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు చిన్న, ఆకాష్, విశ్వం, సాయి, టక్కరి శ్రీను, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా శ్రీకృష్ణజన్మాష్టమి

● ముషీరాబాద్ నియోజకవర్గం యాదవ మహాసభ ఆధ్వర్యంలో వేడుకలు



దోమలగూడలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్

కవాడిగూడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకొని కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ హనుమాన్ దేవాలయంలో అఖిల భారత యాదవ మహాసభ అనుబంధ సంస్థ ముషీరాబాద్ నియోజకవర్గం యాదవ మహాసభ అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు భక్తిశ్రద్ధలతో అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్, బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, ఓబీసీ మోర్చానగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎం.నాగేష్ ముదిరాజ్ హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పూజల అనంతరం అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కె ఆర్‌కే.ప్రసాద్, యాదవ మహాసభ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, బూకాల శ్రీనివాస్‌యాదవ్, బోయిని మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● బర్కత్‌పుర : కాచిగూడ వీరన్నగుట్టలోని శ్యామ్‌బాబా మందిర్‌లో రెండు రోజుల పాటు జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ముగిశాయి. నగర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు శ్యామ్‌బాబా మందిర్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్ పూజలు నిర్వహించారు.

గోల్నాక : గోల్నాక డివిజన్ వీరన్నగుట్టలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేసరినర్సింగ్‌రావుయాదవ్, శ్రీరామ్ హాజరయ్యారు.

తెలంగాణ యాదవసేన ఆధ్వర్యంలో

చిక్కడపల్లి: యాదవసేన రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో శ్రీకృష్ణజన్మాష్టమిని ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.నాగేశ్‌ముదిరాజ్, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ తదితరులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. యాదవసేన నగరఅధ్యక్ష, ఉపాధ్యక్షుడు కిషన్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్సీ మంచి కార్యక్రమాలు నిర్వహించాలి

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ సంస్థ మంచి కార్యక్రమాలు చేయాలని, నీతి, నిజాయితీ, విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నవ్వుతూ నవ్విస్తూ అందరినీ ప్రేమపూర్వకంగా ఉంచేలా చేయాలని పలువురు వక్తలు సూచించారు. ఆదివారం రాంనగర్‌లోని శ్రీసాయి బ్యూటీ సెంటర్‌లో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఐడీ కార్డులు, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. సుప్రీంకోర్టు పూర్వ న్యాయవాది మల్యాద్రీ నేరెళ్ల ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్‌గుప్తా, ప్రధానకార్యదర్శి కల్వ వీరేందర్, ఉపాధ్యక్షుడు సరాఫ్ తులసిగుప్తా, కోశాధికారి రజనీష్, శ్రీకాంత్‌గుప్తా, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు 15 బీసీ సంఘాల మద్దతు

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈనెల 25న ఢిల్లీలో నిర్వహించే సత్యాగ్రహ దీక్షకు 15 బీసీ సంఘాల మద్దతు ప్రకటించాయి. ఆదివారం బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో బీసీ సంఘాల అధ్యక్షుడు నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, జి.అనంతయ్య, వేముల రామకృష్ణ, సి.రాజేందర్, నిమ్మల వీరన్న, జి.కృష్ణయాదవ్, కె.నర్సింహగౌడ్, బర్క కృష్ణ, వెంకన్నగౌడ్, టి.ఆర్.చందర్, నిఖిల్ పటేల్ మాట్లాడారు. ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఆర్.కృష్ణయ్య చేస్తున్న పోరాటానికి బీసీలు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఆత్మీయ బోధనలు.. తరలివచ్చిన క్రైస్తవులు

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): లార్డ్ చర్చ్ పాస్టర్ రాజ్‌ప్రకాష్ పాల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో పశ్చాత్తాప సమావేశాల పేరుతో నిర్వహించిన సభలు ఆదివారం ముగిశాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మూడు రోజుల పాటు వేలాది మంది క్రైస్తవులు హాజరయ్యారు. ఈసందర్భంగా పాస్టర్ రాజ్‌ప్రకాష్‌పాల్, సిస్టర్ జెస్సీ పాల్ క్రైస్తవులకు ఆత్మీయ బోధనలు అందించారు. క్రైస్తవులు ఆత్మీయ జీవితంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంతో యేసు క్రీస్తుపై నిరీక్షణతో ముందుకు సాగాలని సూచించారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి : ప్రొ.కోదండరాం

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ వైద్యుల(ఆర్ఎంపీ, పీఎంపీ) సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రొ.కోదండరాం అన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీల ప్రత్యేక శిక్షణ, గుర్తింపుకార్డులు ఇతరత్రా వాటిపై కృషిచేస్తానన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మన హెల్త్ ఇండియా, విజ్ఞానదర్శిని సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆర్ఎంపీ, పీఎంపీల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే వైద్య, ఆరోగ్యశాఖ మంత్రితో చర్చిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ టీడీ.జనార్దన్ మాట్లాడుతూ ఏపీలో గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించేందుకు కృషిచేస్తానన్నారు. విజ్ఞానదర్శిని అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మన హెల్త్ ఇండియా సంపాదకుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు సీఎస్.రావు, నాగేశ్వర్‌రావు, కృష్ణప్రసాద్, కత్తిమణి, గోవింద్‌రెడ్డి, పీబీ.రాజు, మనోజ్, గణపతిరావు, వెంకటేశ్వర్ రెడ్డి, హెచ్‌పీ.సింగ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా పినాకిని వార్షికోత్సవం

చిక్కడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వర్ధమానులకు స్ఫూర్తి అవార్డులను ప్రదానం చేశారు. శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ సీఈవో ఎ.నాగేశ్వరరావు, మేరా యువ భారత్ ప్రతినిధి ఆకుల మహేందర్‌రెడ్డి, నిర్వాహకులు మురళీమోహన్‌రాజు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన

చిక్కడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ పర్యవేక్షణలో అసోసియేషన్ భవనంలో ఆదివారం హైదరాబాద్ కంటి ఆస్పత్రివారు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.సూర్యప్రకాష్, అంజుబాబు, సంయుక్త కార్యదర్శి జి.పద్మావతి, శివనాయుడు, వైఆర్‌రెడ్డి, సూర్యనారాయణ, అభయ్ పాల్గొన్నారు.

ర్యాలీగా గంగతెప్పోత్సవానికి..



మహాత్మానగర్ నుంచి తరలివెళ్తున్న సంఘం అధ్యక్షుడు బిజ్జి కనకేష్ కుమార్, గంగపుత్రులు

ముషీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో హుస్సేన్‌సాగర్ తీరం వద్ద నిర్వహించిన గంగతెప్పోత్సవానికి ఆదివారం భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్ నుంచి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బిజ్జి కనకేష్ కుమార్ స్థానికంగా ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ర్యాలీలో మత్స్యకారుల వేషధారణలో కళాకారులు, జాలపందిరి, బోనాలు తదితర కళాప్రదర్శనలతో ర్యాలీగా హుస్సేన్‌సాగర్ తీరానికి వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాబూరావు, రాములు తదితరులు పాల్గొన్నారు. భోలక్‌పూర్ హౌస్ నుంచి గంగపుత్ర సంఘం భోలక్‌పూర్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ గంగతెప్పోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడ కొండల్, మహిళా కమిటీ అధ్యక్షురాలు గంగ ఆధ్వర్యంలో బోనాలతో హుస్సేన్‌సాగర్ తీరం వద్ద గల గంగమ్మ దేవాలయానికి చేరుకుని బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

కంటి జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న రామచందర్‌రావు, పక్కన కార్పొరేటర్ అమృత

నల్లకుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కంటి జబ్బుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నల్లకుంట మెయిన్ రోడ్‌లోని శంకరమఠంలో వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఈ శిబిరాన్ని ప్రారంభించి వైద్యులతో కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని చూడాలంటే అది కంటి ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కళ్లను కాపాడుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత నిర్వాహక సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'గౌడల పొట్టగొడుతున్న ప్రభుత్వం'

చిక్కడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదగౌడలు, గీతకార్మికుల పొట్టగొడుతోందని గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంటారం యాదగిరిగౌడ్ ఆరోపించారు. నగరంలో కల్లు దుకాణాలు మూసివేయడంతో గుడ్‌విల్ అందకపోవడంవల్ల కల్లుదుకాణాల సొసైటీ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆదివారం గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి వివేక్‌నగర్ బస్తీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదగిరిగౌడ్ మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖ తమ కల్లుసొసైటీలకు చెట్లను కేటాయించిన నేపథ్యంలో ఆ చెట్ల నుంచి వచ్చిన కల్లు అమ్ముడుపోకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారన్నారు. కానీ కల్తీకల్లు ఇక ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కల్లుదుకాణాలను తెరిపించాలని యాదగిరిగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమసంఘం సభ్యులు శంకర్‌గౌడ్, నవీన్‌గౌడ్, చెన్నయ్య, సుబ్బారావు, చిన్నా, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

'గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి'

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరిగేలా ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ కోరారు. ఆదివారం డీడీ కాలనీలోని అంబర్‌పేట నియోజకవర్గం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలలో యువతీయువకులను భాగస్వాములను చేసి వారిలో ఆధ్యాత్మికతను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ఏడెల్లి అజయ్‌కుమార్, చుక్క జగన్, అచ్చిని రమేష్, జి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


టీజేవైవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్ ముదిరాజ్

రాంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి యువజన విభాగం(టీజేవైవీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంబర్‌పేట నియోజకవర్గంలోని నల్లకుంటకు చెందిన కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై విశ్వాసంతో అప్పగించిన ఈ బాధ్యతలు విజయవంతంగా నిర్వహిస్తానని అన్నారు.

'యువజ్యోతి' కాలనీ అధ్యక్షురాలిగా సునీత

కవాడిగూడ: దోమలగూడలోని యువజ్యోతి కాలనీ అసోసియేషన్ అధ్యక్షురాలిగా కల్వ సునీత నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం దోమలగూడలో జరిగిన యువజ్యోతి కాలనీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆమెను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సతీష్, సభ్యులు కల్వ శంకర్, లక్ష్మణ్, మహేష్, నాగరాజు, రేణుక, అంజమ్మ పాల్గొన్నారు.

చిన్నారితో సహా తల్లి అదృశ్యం



తల్లి గీతతో చిన్నారి

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి 15 నెలల చిన్నారితో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాచిగూడ పీఎస్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మౌలానా ఆజాద్‌నగర్‌లో నివాసం ఉంటున్న ముత్యాలరావు భార్య ఎం.గీత(30) గృహిణి, వారికి 15 నెలల చిన్నారి ఉంది. ఈనెల 16న సాయంత్రం 5 గంటల సమయంలో గీత తన చిన్నారిని తీసుకుని ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంటికి వచ్చిన భర్తకు భార్య కనిపించకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఈ మేరకు భర్త కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.